సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 24 । మార్చి । 2023



ఎన్నికల సందడి

భువనగిరి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నేపథ్యంలో సందడి నెలకొంది.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-54 (శనివారం ఉదయం)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35° / 23°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం తనిఖీ



వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సునీత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తనిఖీ చేశారు. కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న మహిళల వద్దకు వెళ్లి ఏయే కోర్సులు నేర్చుకుంటున్నారు, శిక్షకులు బాగా శిక్షణ ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కుట్టు మిషన్, కంప్యూటర్ వంటి శిక్షణ తీసుకుంటున్న మహిళల ప్రతిభ ఏ విధంగా ఉందనే అంశాలతో పాటు ఎంతమంది శిక్షణ తీసుకుంటున్నారని నిర్వాహకుల ద్వారా ఆరా తీశారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు యాదగిరిగుట్ట పట్టణంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆలయంలో గజవాహన సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువ జామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామివారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం జరిపించారు. సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్ర నామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. అదేవిధంగా శ్రీపర్వత వర్ధని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

టెన్త్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

భువనగిరి: ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్స్‌ను శుక్రవారం నుంచి bre.telanga.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పాటిమట్ల గ్రామంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రచ్చ కల్పన, స్థానిక సర్పంచ్ డి.మల్లేషం, నార్మ్యాల్ డైరెక్టర్ రచ్చ నర్సింహ్మారెడ్డి, డాక్టర్ హేమంత్‌కుమార్, ఏఎన్‌ఎంలు సంధ్యారాణి, విజయ, కంటి వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మోత్కూరు మున్సిపల్ పరిధిలోని అన్నెపు వాడలో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్రం కవిత, డాక్టర్ ఎన్.హేమంత్‌కుమార్, డాక్టర్ నిరోష, క్యాంపు ఇన్‌ఛార్జి త్రివేణి, ఏఎన్‌ఎంలు సంధ్యారాణి, అంజమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్‌కు అడ్డుకట్ట..



చిట్యాల : ఉద్యోగవేటలో విసిగిపోయిన నిరుద్యోగ యువకులు సులువుగా డబ్బులు సంపాదించేందుకుగాను కిడ్నీ రాకెట్ మాయలో చిక్కిపోయిన విషయాన్ని 2016 జనవరిలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. నల్లగొండ మండలానికి చెందిన ఓ యువకుడు తొలుత తన కిడ్నీ అమ్ముకుని.. తర్వాత కిడ్నీ రాకెట్‌లో సభ్యుడిగా మారాడు. డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులను గుర్తించి.. కిడ్నీ ఇస్తే లక్షల రూపాయలు వస్తాయంటూ చెప్పి.. ఐదుగురి కిడ్నీలను అమ్మించాడు. ఈ రాకెట్‌లో నిరుద్యోగులు చిక్కి తమ కిడ్నీలను అమ్ముకుంటున్న అంశాలపై తగిన వివరాలతో 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. దీంతో అప్రమత్తమైన పోలీస్‌శాఖ వెంటనే కిడ్నీ రాకెట్ ముఠాను ఛేదించి ఎందరో యువకుల జీవితాలను కాపాడింది. ఏజెంట్‌లుగా మారిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి కిడ్నీ రాకెట్‌కు అడ్డుకట్ట వేశారు.

అక్షరమే ఆయుధంగా 'సాక్షి' ప్రజల పక్షాన నిలుస్తోంది. ఆవిర్భావంతోనే ప్రభంజనం సృష్టించి ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేసుకుంది. పదిహేనేళ్ల ప్రస్థానంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక కుంభకోణాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను వెలుగులోకి తెచ్చి అధికార యంత్రాంగంలో కదలిక తీసుకువచ్చింది. అంతేకాదు.. అభాగ్యుల దీన పరిస్థితిపైనా కథనాలు ప్రచురించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. సమస్య ఏదైనా పరిష్కరించే వరకు అక్షర సమరం సాగిస్తూ ప్రజలు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలుస్తున్నది. 15 వసంతాలు పూర్తి చేసుకొని 16వ పడిలోకి అడుగిడుతున్న సాక్షి.. మున్ముందు కూడా ఇదే ఒరవడిని కొనసాగిస్తుంది. -సాక్షి, నెట్‌వర్క్

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక సమస్యలు వెలుగులోకి
- అభాగ్యులకు అండగా.. అక్రమార్కుల ఆట కట్టించేలా..
- పదిహేనేళ్లలో ప్రజా సమస్యలపై అక్షర సమరం
- మున్ముందు కూడా ఇదే ఒరవడికి పునరంకితం



పిట్టలగూడెంలో తీరిన సమస్యలు



ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న గ్రామస్తులు (ఫైల్)

యాదగిరిగుట్ట : యాదాద్రి పుణ్యక్షేత్రానికి కూతవేటు దూరంలోనే ఉన్న మల్లాపురం మధిర పిట్టలగూడెంలో అందరూ సంచార జాతుల వారే. దశాబ్దాల క్రితం ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ఓటు హక్కు కూడా ఉంది. కానీ, వీరికి ప్రభుత్వ ఫలాలు అందడం లేదు. ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసిన పాలకులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. రోడ్లు, వీధి దీపాలు లేవు. విద్యార్థులకు అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వడం లేదు. విద్యార్థులు బడికి వెళ్లాలంటే రెండు కిలో మీటర్లు నడిచి పోవాలి. ఎంతో మంది ఉపాధికోసం వలసపోతున్నారు. ఈ క్రమంలో 'పల్లె కన్నీరు పెడుతోంది.. గూడు విడిచి' అనే శీర్షికతో 2016 మే 22వ తేదీన సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, అప్పటి జెడ్పీటీసీ సభ్యురాలు కర్రె కమలమ్మ, తహసీల్దార్ రామకృష్ణ గ్రామాన్ని సందర్శించారు. సమస్యలను పరిష్కరించారు.

సాక్షి కథనంతోనే సమస్యలు పరిష్కారం



మా పిల్లల చదువుల కోసం కుల ధ్రువీకరణ పత్రాలు కావాలని తహసీల్దార్ కార్యాలయం వెళ్తే మీది ఏ కులమని అధికారులు అడిగేవారు. సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించేవారు. విద్యుత్ సౌకర్యం సరిగా లేదు. వీధి దీపాలు లేక పలువురు పాముకాటుకు గురై మరణించారు. ఈ సమయంలోనే సాక్షి దినపత్రిక మా ఊరి సమస్యలను వెలుగులోకి తెచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాన్ని సందర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యాయి. 'సాక్షి'కి కృతజ్ఞతలు.

–రాము, పిట్టలగూడెం

అముదకు అండగా..

కోదాడ: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి మతిస్థిమితం తప్పి కోదాడలో చెత్త కుప్పల మధ్యకు చేరుకున్నదో అభాగ్యురాలు. ఆమెను అక్కడే చెప్పులు కుట్టుకొనే పల్లె వెంకటేశ్వర్లు గమనించి ఆదరించి తన ఇంటికి తీసుకెళ్లాడు ఈ విషయాన్ని 'మానవత్వం పరిమళించింది.. ఓ మోడు చిగురించింది' అనే శీర్షికన సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. దీనికి స్పందించిన దాతలు వెంకటేశ్వర్లు కృషికి సాయమందించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేయించారు. దీంతో అముద మామూలు మనిషిగా మారింది. అముద పరిస్థితిపై 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించడంతో ఈ విషయం మంత్రి హరీశ్‌రావు దృష్టికి వెళ్లింది. ఆయన ఆమెకు కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ అటెండర్‌గా ఉద్యోగం ఇప్పించారు. 'సాక్షి'లో ప్రచురితమైన పలు కథనాల ఆధారంగా కొందరు ఆమె జీవిత చరిత్రను సినిమాగా తీశారు. ఆముద ప్రస్తుతం క్యాన్సర్‌తో బాధపడుతూ దాతల సాయం అర్థిస్తోంది.



ప్రాణం నిలబెట్టిన 'సాక్షి'



చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను నేను ఆదరిస్తే, ఆమెను మనిషిగా చేసింది మాత్రం 'సాక్షి' అందించిన సాయమే. సాక్షి అందించిన, అందిస్తున్న ఈ సాయానికి నాతో పాటు అముద కూడా ఎంతో రుణపడి ఉంటుంది. ఆమె ఇంకా బతకాలి అంటే దాతలు మరోసారి మానవత్వంతో ముందుకు వచ్చి సాయమందించాలి.

– పల్లె వెంకటేశ్వర్లు, కోదాడ

రాచకొండ భూములను కాపాడిన 'సాక్షి'

సంస్థాన్ నారాయణపురం : చారిత్రకంగా పేరుగాంచిన రాచకొండను అప్పటి రెవెన్యూ అధికారులు, వ్యాపారులు అక్రమాల కొండగా మార్చేశారు. కంచే చేను మేసే అన్న చందంగా ప్రభుత్వ భూమిని అధికారులు, రియల్ వ్యాపారులతో కుమ్మక్కై సొంత భూముల మాదిరిగా అమ్మేసుకున్నారు. ఆ అక్రమాలపై సాక్షి 2009–2010 మధ్య సుమారు 2 నెలల కాలంలో పలు కథనాలు ప్రచురించింది. దీంతో రాచకొండలోని రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడ్డ రిటైర్డ్ తహసీల్దార్ రేఖల రాములు, అప్పటి రాచకొండ వీఆర్‌ఓ ప్రకాశ్‌రావు, ప్రభుత్వ భూములను అమ్ముకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులను, తోడ్పాటునందించిన రిటైర్డ్ ఆర్డీఓ హరిసింగ్, అప్పటి తహసీల్దార్ జగదీశ్వర్, సబ్ రిజిస్ట్రార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ప్రభుత్వ భూములను కొనుగోలు చేసిన ఓషెన్ పార్కు ఎండీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అప్పటి జేసీ ప్రియదర్శిని రాచకొండలోని లొకేషన్లు, సర్వే నంబర్లు, రికార్డులును సరిచేశారు.

ధాన్యం కుంభకోణం బట్టబయలు



సూర్యాపేట: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కు కేటాయించిన ధాన్యం నిల్వలకు సంబంధించి రూ.138.50 కోట్ల కుంభకోణాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. సూర్యాపేట జిల్లాలో 2020–21 వానాకాలం, 2021–22 వానాకాలం, యాసంగి సీఎంఆర్ బకాయిలను కొందరు మిల్లర్లు చెల్లించడం లేదు. దీంతో ధాన్యం నిల్వలపై అనుమానం వ్యక్తం చేస్తూ 2022 నవంబర్ 23న 'ధాన్యం ఉందా.. లేదా', నవంబర్ 24న 'ధాన్యం బుక్కింద్రు' అనే శీర్షికలతో జిల్లా పేజీలో, అలాగే నవంబర్ 25న 'సీఎంఆర్ ధాన్యం మాయం' శీర్షికన రూ.138.50 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టిన పరిస్థితిపై మెయిన్ పేజీలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లాలో, రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్ ధాన్యం నిల్వలపై విజిలెన్స్, ఎఫ్‌సీఐ అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లాలో సీఎంఆర్ పెండింగ్ ఉన్న కోదాడ మండలం కాపుగల్లులో శ్రీ ఉషశ్విని మిల్లులో రూ.32.50 కోట్ల విలువైన ధాన్యాన్ని అమ్ముకున్నట్లు గుర్తించారు. జిల్లాలో మొత్తం 8 మిల్లుల్లో రూ.138.50 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. రాష్ట్రంలో 118 మిల్లుల్లో సీఎంఆర్‌కు కేటాయించిన ధాన్యం నిల్వలు లేవని గుర్తించి వాటిపై చర్యలకు ఆదేశించారు. జిల్లాలో సీఎంఆర్ ధాన్యం అమ్ముకున్న మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టి, క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

అధికారుల లోగుట్టు విప్పి..

చింతపల్లి : చింతపల్లి మండలం కిష్టరాయినిపల్లిలో 2016లో డిండి ఎత్తిపోతల పథకం ముంపు ప్రాంతం పేరిట రూ.కోట్లల్లో ప్రభుత్వ ధనాన్ని పరిహారం రూపంలో స్వాహా చేయాలని భావించిన ప్రభుత్వ అధికారుల లోగుట్టును 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వం అందించే పరిహారం స్వాహా చేయాలనే ఉద్దేశంతో 180 ఎకరాల ప్రభుత్వ భూమికి అక్రమ పట్టాలు సృష్టించారు. ఈ ఘటనపై 2016 మార్చి 24లో 'గుట్టకు పట్టాలు' శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అప్పటి కలెక్టర్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అప్పటి జేసీ నీలకంఠం అదే రోజున 53 మంది సర్వేయర్లు, రెవెన్యూ బృందంతో రాత్రి ఒంటి గంట వరకు సర్వే చేశారు. ఈ ఘటనలో చింతపల్లిలో గతంలో పని చేసిన నలుగురు తహసీల్దార్లు, ముగ్గురు వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ కేసు ఇప్పటికీ కొనసాగుతోంది.

సాక్షి కథనాలతో వచ్చిన స్పందనలు మరికొన్ని..

జోన్ పేజీలో

నీలగిరిలో 23 మంది ఉద్యోగుల సస్పెన్షన్.

- సంచలనం సృష్టించిన 'సాక్షి' కథనాలు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీలో 2011 నుంచి 2016 వరకు జరిగిన అవినీతి, అక్రమాలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఆస్తి పన్ను, భవన నిర్మాణ అనుమతుల ఫీజులను మున్సిపల్ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు అందినకాడికి దండుకున్నారు. దాదాపు రూ.20 కోట్లను ఇంటి దొంగలు కొల్లగొట్టినట్లు 'సాక్షి' 30 కథనాలను ప్రచురించింది. ఈ కుంభకోణం అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. స్టేట్ ఆడిట్, స్పెషల్ ఆడిట్ నిర్వహించి మున్సిపల్ సొమ్ము కాజేసినట్లు తేల్చారు. ఈ అక్రమాలకు పాల్పడిన 23 మంది ఉద్యోగులను ప్రభుత్వం రెండేళ్ల పాటు సస్పెండ్ చేసింది. ఈ ఐదేళ్ల కాలంలో నీలగిరి మున్సిపాలిటీలో పని చేసిన కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లకు సైతం మెమోలు జారీ చేశారు. ఇప్పటికీ ఈ కేసు సంబంధిత ఉద్యోగులను వెంటాడుతూనే ఉంది. కొందరు ఉద్యోగులు అరెస్ట్ అయి జైల్‌కు వెళ్లి రాగా, మరి కొందరు అరెస్ట్ కాకుండా కోర్టులో స్టే తీసుకువచ్చారు. అక్రమాలపై 'సాక్షి'లో కథనాలు రావడంతో రాష్ట్రంలో మ్యాన్‌వల్ పద్ధతికి ఫుల్‌స్టాప్ పడింది. మొత్తం ఆన్‌లైన్ చేసి హ్యాండ్ హెల్డ్ మిషన్లను ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేసింది. ఆన్‌లైన్ లావాదేవీలతో మున్సిపాలిటీల్లో అక్రమాలకు తెర పడింది.

రోడ్డు తెచ్చిన 'వీఐపీ రిపోర్టర్'



ధర్మారెడ్డిగూడెం వరకు నిర్మించిన బీటీ రోడ్డు

సాక్షి, యాదాద్రి : ఎన్నో ఏండ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య సాక్షి వీఐపీ రిపోర్టర్ కార్యక్రమం తీరింది. 2014లో తెలంగాణ ప్రభుత్వం వచ్చిన వెంటనే నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో 'సాక్షి' వీఐపీ రిపోర్టర్ శీర్షికతో వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతతో ఆలేరు మండలం కొలనుపాక మధిర గ్రామమైన బైరాంనగర్‌లో చేపట్టిన కార్యక్రమంలో సాక్షి రిపోర్టర్‌గా వ్యవహరించారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తీర్చాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మరుసటి రోజు 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మరుసటి సంవత్సరం బడ్జెట్‌లో ఆలేరు మండలం కొలనుపాక నుంచి వయా బైరాంనగర్ మీదుగా.. ధర్మారెడ్డిగూడెం వరకు బీటీ రోడ్డును మంజూరు చేశారు. ఈ పనులకు 2015 ఏప్రిల్ 15న ఎమ్మెల్యే గొంగిడి సునీత శంకుస్థాపన చేశారు.

ఇబ్బందులు తొలగిపోయాయి



సాక్షి దినపత్రిక నిర్వహించిన వీఐపీ రిపోర్టర్‌గా ఎమ్మెల్యే కార్యక్రమంతో రోడ్డు వచ్చింది. మా ఇబ్బందులు తొలగిపోయాయి. గతంలో మట్టి రోడ్డు ఉండడం వల్ల రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడేవాళ్లం. బీటీ రోడ్డు వేయడంతో సంతోషంగా ఈ రోడ్డుపైన ప్రయాణాలు సాగిస్తున్నాం.

– గవ్వల సోములు, బైరాంనగర్

ఎన్నికలకు సిద్ధం కావాలి

- 28 నుంచి ఆత్మీయ సమ్మేళనాలు
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మాట్లాడుతున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : నవంబర్‌లో జరగనున్న సాధారణ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 28నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు ఆలేరు నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి 10 గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు సమ్మేళనాలు నిర్వహిస్తామని, ఇందుకోసం కో ఆర్డినేటర్లను నియమించినట్లు చెప్పారు. సమ్మేళనాల్లో తెలంగాణ రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. రాజాపేట మండలం రఘునాథపురం నుంచి సమ్మేళనాలకు శ్రీకారం చుడుతామని మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెంతో ముగుస్తాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఐటీ, ఈడీ దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. రాష్ట్రానికి ఉపాధిహామీ పథకం ద్వారా వచ్చే రూ.1300 కోట్లు నిలివేసిందన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్లు ఎరుకల సుధా, వస్పరి శంకరయ్య, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, మండల సెక్రటరీ జనరల్ కసావు శ్రీనివాస్, రైతు బంధు డైరెక్టర్ మిట్ట వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు బీసు చందర్‌గౌడ్, పిన్నపునేని నరేందర్‌రెడ్డి, బొట్ల యాదయ్య, రామకృష్ణారెడ్డి, నర్సింహులు, పద్మ, స్వాతి, వెంకటేష్‌గౌడ్, బీరయ్య ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నియామకంపై విచారణ చేయాలి

భువనగిరిటౌన్: భువనగిరి మున్సిపాలిటీలో అధికార పార్టీ నాయకులు అల్ఫా ఏజెన్సీని అడ్డుగా పెట్టుకుని 28 మంది పారిశుద్ధ్య కార్మికుల నుంచి రూ.65 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసుకుని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకున్నారని ఐఎన్‌టీయూసీ నాయకులు ఆరోపించారు. ఈ నియామకంపై గురువారం వారు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం నియమించుకున్న కార్మికులు పారిశుద్ధ్య పనులు మాత్రమే చేయాలని, కానీ వారు వివిధ సెక్షన్లలో పనిచేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అర్హత లేనివారిని కూడా కార్మికులుగా నియమించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్‌కుమార్, రవికుమార్, నర్సింహ, జగన్, సలావుద్దీన్, నర్సింహాచారి, శ్రీధర్, నరేందర్ ఉన్నారు.

రెక్కల కష్టం నేలపాలు

వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలు

- 7,643 ఎకరాల్లో వరికి నష్టం
- వివరాలు సేకరించిన అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక



సిరిపురంలో దెబ్బతిన్న వరి చేను

రామన్నపేట : వడగండ్ల వానలు అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలను నేలపాలు చేశాయి. కోతకు సిద్ధంగా ఉన్న చేలలో ధాన్యం రాలిపోగా, పొట్ట దశలో ఉన్న చేలు కంకులు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి పెట్టుబడులు మీద పడే ప్రమాదం ఏర్పడింది.

నష్టం ఇలా..

జిల్లాలో ఈనెల 18, 19 తేదీల్లో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. యాసంగి సీజన్ ప్రారంభంలో నాట్లు వేసిన వరిపొలాలు గింజ గట్టిపడే దశలో ఉండగా ఆలస్యంగా నాట్లు వేసిన పొలాలు పొట్టదశలో ఉన్నాయి. వడగండ్లకు జిల్లా వ్యాప్తంగా 7,643 ఎకరాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి. 55 గ్రామాలకు చెందిన 3,755 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. సగానికిపైగా గింజలు నేలరాలగా, పొట్టదశలో ఉన్న చేలు వడగండ్ల దెబ్బకు పొరకగా ఉన్నాయి. గుండాల, చౌటుప్పల్, రామన్నపేట మండలాల్లో నష్టం తీవ్రత అధికంగా ఉంది. గుండాల మండలంలో 1,400 మంది రైతులకు చెందిన 2,550 ఎకరాలకు నష్టం వాటిల్లింది. చౌటుప్పల్ 864 మంది రైతులకు చెందిన 1666 ఎకరాలు, రామన్నపేట మండలంలో 450 మంది రైతులు నష్టపోగా 1000 ఎకరాల్లో వరి చేలు దెబ్బతిన్నాయి. మిగిలిన మండలాల్లో ఆత్మకూరు(ఎం) 977, అడ్డగూడూరు 600, మోత్కూరు 448, వలిగొండ 180, రాజపేట 43, మోటకొండూరు 52 ఎకరాల్లో వరిచేలు దెబ్బతిన్నాయి.

ఉద్యాన పంటలు

75 ఎకరాల మామిడి, 12 ఎకరాల్లో బొప్పాయి, పుచ్చకాయ, 30 ఎకరాల్లో కూరగాయ తోటలు దెబ్బతిన్నాయి. అన్ని పంటలకు కలిసి సుమారు రూ.40 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు పర్యటించి పంటనష్టం వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

మూడెకరాల పొలం దెబ్బతిన్నది



మూడు ఎకరాల్లో వరిసాగు చేశాను. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాను. పంటచేతికి వచ్చే దశలో వడగండ్ల వానకు చేను చాలా వరకు దెబ్బతిన్నది. పెట్టుబడికి తెచ్చిన అప్పులు మీద పడే ప్రమాదం ఉంది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

-వంపు జానయ్య, రైతు, తుర్కలషాపురం, గుండాల మండలం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు సమగ్ర అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో రూ.13.50 లక్షల వ్యయంతో చేపట్టిన కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన, శివారెడ్డిగూడెం, ధర్మారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ భవనాలను జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం సర్పంచులు గోడళ్ల ప్రభాకర్ గౌడ్, పీసర్ల మంజుల మహిపాల్‌రెడ్డి, దోటి కుమార్, సామ రవీందర్‌రెడ్డిలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షురాలు బత్తుల మాధవి, ఎంపీటీసీ బుచ్చయ్య, అమృతమ్మ, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీడీఓ బాలశంకర్, ఏఈ వెంకటేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



భూదాన్‌పోచంపల్లి: మతిస్థిమితం సరిగ్గాలేని వ్యక్తి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ బాద్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇంద్రియాల గ్రామంలో గత కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగ్గాలేని గుర్తుతెలియని వ్యక్తి తిరుగుతుండేవాడు. కాగా గురువారం ఉదయం గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి గుర్తించి వెంటనే భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వయస్సు 35ఏళ్లు ఉంటాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూర్‌–ఎస్‌(సూర్యాపేట): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గట్టికల్ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన మోత్కూరి రామాచారి(36) గురువారం గట్టికల్లు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. సాయంత్రం తిరిగి సూర్యాపేట వెళ్లడానికి గట్టికల్లు నుంచి నడిచి వెళ్తుండగా నెమ్మికల్లు, గట్టికల్లు గ్రామాల మధ్యన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు

నల్లగొండ క్రైం : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతోపాటు జైలు శిక్ష తప్పదని ట్రాఫిక్ సీఐ చీర్ల శ్రీను హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిలో ఒకరికి ఒకరోజు జైలు, ఇంకొకరికి రెండు రోజుల జైలు, జరిమానా, మిగిలిన 10 మందికి గురువారం కోర్టు జరిమానా విధించినట్లు తెలిపారు. మొత్తం 12 మందికి గాను రూ.13వేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నవీన్‌కుమార్

మోత్కూరు : తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన వల్లం దాస్ నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా తనను ఎన్నుకున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూరారం అశోక్, ఆలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా పల్లెర్ల బాబు ఎన్నికయ్యారని తెలిపారు.

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

- కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో సీసీ ఫుటేజ్ హార్డ్‌డిస్క్ స్వాధీనం
- ఆధారాలు లభిస్తే మరిన్ని సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం

భువనగిరి: పట్టణంలోని ప్రగతినగర్‌లో గల కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో ఈ నెల 21న వెలుగులోకి వచ్చిన విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించినట్లు సీడబ్ల్యూసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి 22వ తేదీన నల్లగొండలోని జైలుకు తరలించారు. కాగా ఘటనకు సంబంధించిన ఆధారాల కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గురువారం పట్టణ పోలీసులు పాఠశాలకు వెళ్లి పాఠశాలలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయి, ఎన్ని కెమెరాలు ఉన్నాయని పరిశీలించారు. సంఘటన జరిగిన రోజుతో పాటు మరో రోజుకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని తొలగించబడి ఉంది. దీంతో ఆరోజు ఏం జరిగిందనే విషయాలు తెలుసుకునేందుకు పోలీసులు పాఠశాలలోని సీసీ ఫుటేజీలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిని పరిశీలించేందుకు హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు.

హార్డ్‌డిస్క్‌లో ఆధారాలు దొరికేనా..?

అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు ఎంతవరకు నిజమనేది పోలీసులు స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌లో లభించే ఆధారాలను బట్టి తెలియనుంది. విద్యార్థిని ఆరోపించినట్లుగా సీసీ కెమెరాల్లో ఆధారాలు లభిస్తే మరిన్ని సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం లేకపోలేదు.

విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీడబ్ల్యూసీ

పాఠశాలలో విద్యార్థినుల నుంచి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వివరాలను అడిగి తెలుసుకుంటుంది. ఇందులో భాగంగా రెండురోజు పాఠశాలకు వెళ్లి కొంతమంది విద్యార్థినులతో మాట్లాడారు. శుక్రవారం కూడా విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, భువనగిరి ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డిలు పాఠశాలను సందర్శించి తరగతుల్లో బోధన, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. తాత్కాలికంగా ఏప్రిల్ 23 వరకు పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో పాఠశాల కొనసాగుతుందని డీఈఓ తెలిపారు.

భువనగిరి బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి

- ముగిసిన నామినేషన్ గడువు
- నేడు నామినేషన్ల పరిశీలన



నామినేషన్లు వేస్తున్న న్యాయవాదులు

భువనగిరి: భువనగిరి బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి నెలకొంది. 2023–24 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నిక కోసం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా గురువారం నామినేషన్ల గడువు ముగిసింది. అధ్యక్ష పదవికి నిసంగి విద్యాసాగర్, నాగారం అంజయ్య, బబ్బూరి హరినాథ్, పడాల శ్రీనివాస్, గజ్జల రవీందర్‌రెడ్డి నామినేషన్ వేయగా ఉపాధ్యక్ష పదవి కోసం కుక్కదువ్వు సోమయ్య, కలకుంట్ల జయ, గడీల ప్రభాకర్, జనరల్ సెక్రటరీ పదవికి సీహెచ్. రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కాటేపల్లి మల్లేశం, కోశాధికారి పదవికి చేగూరి అయిలయ్య, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ పదవికి ఆకుల మల్లేశం, లైబ్రరీ సెక్రటరీ పదవికి డాక్టర్ బొల్లేపల్లి కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుల కోసం కడమంచి రాంబాబు, తుమ్మేటి యాదయ్య, పల్లేర్ల నరహరి నామినేషన్లు వేశారు.

నేడు పరిశీలన..

నామినేషన్లను శుక్రవారం పరిశీలించనున్నట్లు ఎన్నికల అధికారి నాయికం రమేష్ తెలిపారు. అదేవిధంగా శనివారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. ఈ నెల 31న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- టీపీసీసీ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

ఆలేరురూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి విమర్శించారు. ఆలేరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వ హామీ నెరవేరలేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కలగానే మిగిలిందన్నారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయలేకపోయిందన్నారు. అరకొరగా నిర్మించిన ఇళ్లను కూడా బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో నిరుపేదలందరికి పార్టీలకు అతీతంగా ఇంటికి ఆర్థిక సాయం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం.. పోటీ పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని స్థితిలో ఉందన్నారు. గ్రూప్–1ను రద్దు చేయడం సరికాదన్నారు. వేలాది మంది నిరుద్యోగులు డబ్బులు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారని, ఎంతో మంది ఏళ్ల తరబడి పరీక్షలకు ప్రిపరేషన్ అవుతున్నారని, పరీక్ష రద్దుతో వారంతా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకేజీ కారకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, దశరథ, మాజీ సర్పంచ్ శంరయ్య, గణేష్, భిక్షపతి, దీపిక, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ జేఏసీ సభ్యులు

మోటకొండూర్: పీఆర్‌సీ, 2004లోపు పని చేస్తున్న వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యుత్ సౌధ వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని విద్యుత్ జేఏసీ యాదాద్రి జిల్లా కన్వీనర్ అమర్‌నాథ్, నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మోటకొండూరులోని ఏఈ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నాయకులు మురళీ, ఏఈ మిట్ట వెంకటేష్, శ్రీనివాస్, రాజేశ్వర్, నరేష్, జైపాల్, మహేష్, రమేష్‌రెడ్డి, అయిలయ్య, రమేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష

- రూ.1000 జరిమానా విధిస్తూ యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు

భువనగిరి: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ గురువారం యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన నాయిని పర్వతాలు కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన నాయిని యాదగిరి పర్వతాలు సోదరుడి కుమారుడు. యాదగిరి మద్యానికి బానిసై ఇంట్లో భార్యాపిల్లలను పట్టించుకోకుండా జులాయిగా తిరిగేవాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోలేదు. మద్యానికి బానిసైన యాదగిరి పర్వతాలు వద్ద తరచూ డబ్బులు అడిగేవాడు. ఈ క్రమంలో ఓ రోజు యాదగిరి డబ్బులు అడగగా ఇవ్వడానికి పర్వతాలు నిరాకరించాడు. దీంతో పర్వతాలుపై పగ పెంచుకుని అతడిని హత్య చేయాలని యాదగిరి నిర్ణయించుకున్నాడు. 2017 జనవరి 17న మధ్యాహ్నం పర్వతాలు భోజనానికి ఇంటికి వస్తాడని భావించి అతడి కోసం ఎదురుచూశాడు యాదగిరి. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన పర్వతాలును మరోసారి యాదగిరి డబ్బులు అడిగాడు. అతడు ఇచ్చేందుకు నిరాకరించడంతో యాదగిరి కోపోద్రిక్తుడై పర్వతాలును కర్రతో కొట్టాడు. తల వెనుక భాగం, ముఖంపై తీవ్ర రక్తస్రావం కావడంతో పర్వతాలు కిందపడి మృతిచెందాడు. వెంటనే మృతదేహంపై బట్టలు వేసి కిరోసిన్ పోసి నిప్పంటించాడు. మృతుడి భార్య కిష్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆధారాలు సేకరించి యాదగిరిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. కాగా గురువారం జిల్లా కోర్టులో ఈ కేసు విచారణకు రాగా, యాదగిరే పర్వతాలును హత్య చేసినట్లు లభించిన ఆధారాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

- నార్మ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు



మహిళలకు కోడిపిల్లలను అందజేస్తున్న నార్మ్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

గరిడేపల్లి: షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుపేద మహిళలు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్), హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో నార్మ్ ఆర్థిక సహకారంతో పెరటి కోళ్ల పెంపకంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు ఆయన మాట్లాడారు. భూమి లేని రైతులు పెరటి కోళ్లను పెంచడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడానికి నార్మ్ సంస్థ, కేవీకే ఇన్‌చార్జి కోఆర్డినేటర్ బి. లవకుమార్ జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి మహిళా రైతులను ఎంపిక చేసుకొని పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కోడిపిల్లలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నార్మ్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. బాలకృష్ణన్, కేవీకే శాస్త్రవేత్తలు ఎన్. సుగంధీ, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్, నరేష్, మాధురీ, ఆదర్శ్, డి. నరేష్, మహిళా రైతులు తదితరులున్నారు.

జనచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర ఈ నెల 27వ తేదీన చిట్యాలకు రానున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి తెలిపారు. జనచైతన్య యాత్ర ప్రచార పోస్టర్‌ను గురువారం చిట్యాలలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనచైతన్య యాత్ర సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. నారబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, మండల కార్యదర్శి అర్రూరి శ్రీనివాస్, పామనగుళ్ళ అచ్చాలు, శీలా రాజయ్య, రుద్రారపు పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని అధ్యయనం చేయాలి

- సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



మునగాల: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జూలూరి గౌరీశంకర్

మునగాల: విద్యార్థులు విద్యతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సాయి గాయిత్రి విద్యానిలయం ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువే ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. నేటి సమాజంలో మానవ విలువలు నానాటికి దిగజారిపోయాయని, ముఖ్యంగా భారత దేశ కుటుంబ వ్యవస్థ అంటేనే ప్రపంచ దేశాలు సైతం చాలా గొప్పగా గౌరవిస్తాయని, అలాంటి వ్యవస్థ నేడు పెరుగుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ముసుగులో కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అర్వపల్లి ఉషారాణి, ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, మునగాల సీఐ పి.ఆంజనేయులు, ఎస్‌ఐ లోకేష్, ఎంఈఓ ఎండీ.సలీమ్ షరీఫ్, సర్పంచ్ ఉపేందర్, పీఏసీఎస్ చైర్మన్లు సత్యనారాయణ, చంద్రయ్య, గ్రామపెద్దలు శ్రీనివాస్, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తులసమ్మకు నివాళి

నడిగూడెం: మండల కేంద్రానికి చెందిన వజ్రాల తులసమ్మ (76) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. దీంతో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్.. తులసమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



భీమనపల్లిలో మన ఊరు- మనబడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాదాద్రి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి తదితరులు

భూదాన్‌పోచంపల్లి: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భీనమపల్లి, దంతూర్ గ్రామాల్లో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డితో కలిసి మన ఊరు–మన బడి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 750 ప్రభుత్వ పాఠశాలలో ఉండగా 250 పాఠశాలలను మన ఊరు–మన బడి కింద తీర్చిదిద్దామన్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు భువనగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలకు ఎలక్ట్రికల్ వాహనాలను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసిల్దార్ వీరాబాయి, సర్పంచులు కంటి రాములు, దోటి కుమార్‌యాదవ్, సర్పంచుల, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షులు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, పాటి సుధాకర్‌రెడ్డి, బాలనర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, పగిళ్ల సుధాకర్‌రెడ్డి, పర్వతరెడ్డి, శ్రీకాంత్, చిల్వేరు శేఖర్, బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి కోరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్టీ పరంగా ఉద్యమించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, కోటిరెడ్డి, కోటేశ్వరావు, షాబుద్దీన్, యాదగిరి, కర్రి సుబ్బారావు, డేగ శ్రీధర్, పాలూరి సత్యనారాయణ, మాతంగి బసవయ్య, బాగ్దాద్, సంపెట రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ మాసం షురూ

పవిత్ర రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. దీంతో నల్లగొండ పట్టణంలో గురువారం నుంచే పలుచోట్ల హరీస్, హలీం సెంటర్లు ప్రారంభంకాగా, పలువురు ముస్లింలు వాటిని కొనుగోలు చేస్తూ కనిపించారు. ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు గాను మసీదులను శుభ్రం చేశారు. పండ్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నల్లగొండ పట్టణంలోని మదీనా మసీదును శుభ్రం చేస్తున్న ముస్లింలు





నల్లగొండ పట్టణంలో ఖర్జూర, హలీస్ కొనుగోలు చేస్తున్న ముస్లిం యువకులు

పత్తి కట్టెను కాల్చొద్దు..

- వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చు
- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు

పాడి పంట



కాల్చడానికి సిద్ధంగా ఉన్న పత్తి కట్టె

నడిగూడెం: పత్తి పంట సాగు పూర్తయిన తర్వాత చేలల్లో మిగిలిపోయిన పత్తి కట్టెను రైతులు కాల్చేస్తుంటారు. ఇలా చేయడం వలన భూమికి గాని, రైతుకు గాని ఎలాంటి ఉపయోగం ఉండదు. వాస్తవానికి పత్తి కట్టె ఎంతో విలువైనది. దీంతో వర్మీ కంపోస్టు తయారు చేసుకొని ఎరువుగా చేసుకోవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు తెలిపారు. పత్తి కట్టెతో ఎరువులు ఎలా తయారుచేసుకోవాలో ఆయన మాటల్లోనే..

పత్తి ఏరిన తర్వాత మొక్కల్ని వేర్లతో సహా పీకి ఒకచోట పోగేయాలి. 30–50 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, 3 అడుగుల ఎత్తు ఉండేలా ఇటుకలతో కుండీలు కట్టుకోవాలి. కుండీల అడుగున మొరం పోసి, నేలను గట్టిపరచాలి. ఎండ తగలకుండా, వాన పడకుండా కుండీల మీద షెడ్డు వేసుకోవాలి. అందులో పీకిన పత్తి కట్టెను ట్రాక్టర్ సహాయంతో తొక్కించి గుంతలో వేయాలి. ఆ గుంతలో పశువుల పేడను వారం రోజులు వేయాలి. ముందుగా కుండీల్లో అడుగు వరకు పత్తి కట్టె ముక్కల్ని నింపి, వాటిపై నీటిని పోయాలి. ఆ తర్వాత మళ్లీ కట్టె ముక్కల్ని నింపాలి. చివరగా కొంత నీరు కలిపి పేడను కట్టె ముక్కలపై పోయాలి. ప్రతిరోజు కుండీల్లో నింపిన కట్టెలపై అప్పుడప్పుడు కొన్ని నీళ్లు చల్లుతూ అవి తేమగా ఉండేలా చూడాలి. నీటిని మరీ ఎక్కువగా పోయకూడదు. అంటే వానపాములు తినడానికి వీలుగా మెత్తబడతాయి. ఒక్కో కుండీపై 20కిలోల చొప్పున వానపాముల్ని వదలాలి. అవి కుళ్లిన పత్తి కట్టె ముక్కల్ని తింటూ, వాటిని 40–45 రోజుల్లో నాణ్యమైన వర్మీ కంపోస్టుగా మారుస్తాయి.

పోషకాల లభ్యత..

పశువుల పేడ కంటే రెట్టింపు నత్రజని, 8 రెట్లు అధికంగా పొటాష్, పత్తి మోడులో ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. పత్తిలో దూది 40శాతం దిగుబడులు వస్తే, 60శాతం మోడులు వస్తాయి. సాధారణంగా ఎకరాకు 6 క్వింటాళ్ల వరకు పత్తి మోడులు వస్తాయి. వీటిని భూమిలో కలియదున్నడం వలన 10కిలోల నత్రజని, 36కిలోల పొటాష్ భూమికి అందుతుంది. సూక్ష్మపోషకాలైన మాంగనీస్ 365 పీపీఎం, ఇనుము 2791 పీపీఎం, రాగి 27 పీపీఎం ఉన్నట్లు నిర్ధారించారు. పత్తి మోడులను కలియదున్నడం వలన రెండో పంటకు కావాల్సిన పొటాష్, 20శాతం వరకు నత్రజనిని అందించవచ్చు.

కాల్చకుండా కూడా దున్నవచ్చు..

పత్తి మోడులను కాల్చకుండా భూమిలోనే దున్నినా ఎలాంటి ఇబ్బంది లేదు. 36 బ్లేడ్‌లు, 5 అడుగులు ఉండే రోటోవేటర్‌ను 45 హెచ్‌పీ ట్రాక్టర్‌తో పత్తి చేనును దున్నడం వల్ల రైతులకు చాలా లాభాలున్నాయి. రోటోవేటర్‌తో పత్తి మోడులు దున్నటం వల్ల మోడులు భూమిలో కలిసిపోవడమే కాకుండా, ఆరు అంగుళాల వరకు భూమిలోని మట్టి కూడా తలకిందులతుంది.

ఎన్నో ప్రయోజనాలు..

పత్తి కట్టెతో వర్మీ కంపోస్టును తయారుచేయడం వలన పలు ప్రయోజనాలు ఉన్నాయి. వర్మీ కంపోస్టు తయారు చేయడానికి అవసరమైన పత్తి కట్టె ఒకేసారి ఎక్కువ పరిమాణంలో దొరుకుతుంది. దీని వల్ల తక్కువ సమయంలో ఎక్కువ సేంద్రీయ ఎరువును తయారు చేసుకోవచ్చు. వర్మీ కంపోస్టు తయారైన వెంటనే అదే భూమిలో వేసే పంటకు ఎరువుగా వేసుకోవచ్చు. కాబట్టి దీనిని నిల్వ చేసుకోవాల్సిన అవసరం పెద్దగా ఉండదు. దీని వల్ల భూ భౌతిక పరిస్థితులు మెరుగుపడతాయి. నీరు నిల్వ చేసుకొనే శక్తి పెరుగుతుంది. రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. సూక్ష్మపోషక లోపాలు తగ్గుతాయి.